సాక్షి ప్రకాశం

సోమవారం | 19 | జూన్ | 2023

I



ఇంటర్ అర్హతతోనే ఉద్యోగాలు
ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఉద్యోగాలు శుభపరిణామమని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆర్ లోకనాథం అన్నారు. - IIలో..



సముద్రంలో గల్లంతైన గ్రానైట్ కార్మికుడు మృతి
కొత్తపట్నం సముద్రంలో గల్లంతైన గ్రానైట్ కార్మికుడు మృతిచెందాడు. - IIలో..

గరిష్టం/కనిష్టం
41 /34

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం పడే అవకాశం ఉంది. ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

ఏపీ ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్‌లో మౌనికకు ప్రథమ ర్యాంకు



పి.మౌనిక

ఒంగోలు: ఏపీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టులో పి.మౌనిక ప్రథమ ర్యాంకు సాధించారు. మౌనిక స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో బీకాం మూడో సంవత్సరం చదువుతుంది. ఈమె తాజాగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన ఏపీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్‌టెస్టులో ప్రథమర్యాంకును కైవసం చేసుకోవడంతో ఆమెకు కాలేజీ ప్రిన్సిపాల్, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ జి.ధనుంజయరావుతోపాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. మౌనిక ఇప్పటికే రాష్ట్ర, జాతీయస్థాయి, యూనివర్శిటీ, ఆల్‌ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొని 100 మీటర్లు, 200 మీటర్లు పరుగుపందెంలో అనేక పతకాలను కైవసం చేసుకుంది.

అయ్యవారిపల్లిలో పులి సంచారం



పులి పాదముద్ర

అర్థవీడు (కంభం): అర్థవీడు మండలంలో మరో మారు పులి సంచారం కలకలం రేపింది. మండలంలోని అయ్యవారి పల్లి సమీపంలోని చింతమల్లెలపాడు నీటి కుంట వద్ద పులి మంచినీళ్లు తాగి వెళ్లినట్లు మేకల కాపరులు గుర్తించారు. నీటి కుంట పరిసర ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. పులిసంచారం చేస్తున్నట్లు వార్తలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.

సంస్కృతిలో భాగం పౌరాణిక నాటకాలు

- ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు



నాగినేని వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: పౌరాణిక నాటకాలు తెలుగు ప్రజల సంస్కృతిలో ఒక భాగమని, ప్రజలు నాటకాలను, పౌరాణిక నాటకాలను ఆదరించాలని ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు కోరారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం అండ్ క్లబ్‌లో నాగినేని నరసింహారావు 12వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. సభకు ఆ సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ట్రాఫిక్ డీఎస్పీ మాట్లాడుతూ పౌరాణిక నాటకాలకు పెద్దగా ఆదరణ లేని తరుణంలో నాగినేని అసోసియేషన్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తొలుత నాగినేని చిత్రపటానికి, నటరాజు విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళి అర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా 'దేవనర్తకి' నాటకం నుంచి ఓ ఘట్టాన్ని, 'గయోపాఖ్యానం' నుంచి యుద్ధ ఘట్టాన్ని, 'సత్యహరిశ్చంద్ర' నుంచి వారణాసి ఘట్టాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ, డా.నూనె అంకమరావు, కుర్రా ప్రసాద్‌బాబు, డా.సంతవేలూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పశు వైద్యం మరింత చేరువ



వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ రథం

ప్రజారోగ్య పరిరక్షణకు 108, 104 ద్వారా సేవలందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలకు కూడా సకాలంలో అత్యవసర వైద్యం అందించేందుకు సంచార పశు ఆరోగ్య సేవా రథాలను ఏర్పాటు చేసింది. రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్యసేవలందించడంతో పాటు అత్యవసరమైన పరీక్షలు చేసి అవసరమైతే అక్కడికక్కడే శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నారు. దీంతో మారుమూల ప్రాంతాల్లో సైతం పశువైద్య సేవలు అందుతున్నాయి. మూగజీవులు అస్వస్థతకు గురైతే వ్యయప్రయాసలతో వైద్యం చేయించుకునే శ్రమ తప్పిందని పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పశుఅంబులెన్సుల ద్వారా ఇప్పటి వరకు అందించిన అత్యవసర చికిత్సలు ఇలా..

నియోజకవర్గం	అందించిన వైద్య సేవలు
కొండపి	2034
మార్కాపురం	2066
దర్శి	1707
సంతనూతలపాడు	1688
గిద్దలూరు	1772
ఒంగోలు	1775
యర్రగొండపాలెం	1574
కనిగిరి	1987
మొత్తం సేవలు	14,603

టంగుటూరు:

సంచార పశు వైద్య అంబులెన్సులతో ప్రభుత్వం మూగజీవులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తోంది. 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోను చేసిన వెంటనే అంబులెన్సులు ఆయా ప్రాంతాలకు చేరుకొని చికిత్స చేస్తుంటే రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి రెండు సంచార అంబులెన్సులు సేవలందిస్తున్నాయి. సంచార పశు ఆరోగ్య సేవా రథాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. ఇందులో పేడ, రక్త పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన పరికరాలు ఉన్నాయి. పెంపుడు జంతువులకు అక్కడికక్కడే శస్త్ర చికిత్సలు చేసే సదుపాయం కల్పించారు. 22 రకాల పరీక్షలు చేసి వ్యాధిని అక్కడికక్కడే నిర్ధారించి చికిత్స చేస్తున్నారు. గ్రామంలోనే అత్యవసర వైద్య సేవలు అందించటం సాధ్యం కానప్పుడు వాహనంలోనే ఏరియా వెటర్నరీ హాస్పిటల్ లేదా బహుళార్ధ పశువైద్యశాలలకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

- సంచార పశు వైద్యశాల వాహనంతో తీరుతున్న పాడి రైతుల కష్టాలు
- పశువుల ఆరోగ్య పరిరక్షణకు అందుబాటులోకి మొబైల్ అంబులెన్సులు
- రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి పశువులకు వైద్య సేవలతో పాటు ఉచిత మందుల పంపిణీ
- ఉచిత సేవలకు టోల్ ఫ్రీ నంబరు 1962
- నియోజకవర్గానికి రెండు మొబైల్ అంబులెన్సులు
- వాహనంలోనే ల్యాబు, పశువులు తరలించేందుకు వీలుగా హైడ్రాలిక్ క్రేన్

ఆ తర్వాత వాహనంలోనే తిరిగి రైతు ఇంటికి చేర్చటం విశేషం.

నియోజకవర్గానికి రెండు వాహనాలు...
జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఒక్కో దానికి రెండు వాహనాలు, కనిగిరి నియోజకవర్గానికి మూడు వాహనాలు ఉన్నాయి. కొండపి, టంగుటూరు, మార్కాపురం, పొదిలి, దర్శి, కురిచేడు, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, కనిగిరి, కంభం, సీఎస్‌పురం, గిద్దలూరు, హనుమంతునిపాడు, ఒంగోలు, కొత్తపట్నం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల్లో సకాలంలో పశువైద్య సేవలందిస్తున్నాయి.

అత్యవసర వైద్య సేవలు:
- ఆవులు, గేదెల్లో గైనిక్ సమస్యలకు సంబంధించి సంచార పశువైద్య క్లినిక్ ద్వారా అత్యవసర చికిత్స అందుతోంది.
- గైనిక్ సమస్యలతో ఈనలేకపోవడం, కడుపులో దూడలు అడ్డం తిరగడం తదితరాలు
- పాల జ్వరం, కడుపు ఉబ్బరం, విషపూరిత మేత తినడం, మూత్రాశయంలో రాళ్లు, క్యాన్సర్ గడ్డలు వంటి సమస్యలకు వైద్యం చేస్తున్నారు.

అంబులెన్సుల్లో 120 రకాల మందులు:
యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, విటమిన్ ఇంజక్షన్లు, కాల్షియం టానిక్‌లు, యులాన్ లిక్విడ్ టానిక్‌లు, పౌడర్‌లు, మినరల్ మిక్చర్, సెలైన్ బాటిల్స్ తదితరాలన్నీ అంబులెన్సుల్లో అందుబాటులో ఉంటాయి. ఇలా 120 పైగా మందులు సిద్ధంగా ఉండటంతో పాడి పశువులకు మెరుగైన సేవలు అందించటం సులభమవుతుంది.

గంట నుంచి గంటన్నరలోనే అత్యవసర వైద్య సేవలు:
మొబైల్ అంబులేటరీ క్లినిక్‌లకు నిర్దేశించిన 1962 టోల్ ఫ్రీ నంబరు 24 గంటలు పనిచేస్తుంది. ఈ సేవలను 4 రకాలుగా విభజించారు. లెవల్- 1 ఫర్టిలైజర్‌తో కూడా మేత తిని అస్వస్థతకు గురైనప్పుడు, పాముకాటు, పాల జ్వరం, కడుపు ఉబ్బరం తదితరాల కిందకు వచ్చే కేసులకు గంట నుంచి రెండు గంటల్లోపు చికిత్స అందుతుంది. లెవల్- 2 నుంచి లెవల్- 4 వరకు వచ్చే అత్యవసరం కాని కేసులకు 5 నుంచి 24 గంటల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.



టంగుటూరులో లిఫ్టు ద్వారా పశువుకు వైద్యం చేస్తున్న దృశ్యం

అత్యుత్తమ సేవలు అందిస్తున్నాం



డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ రథాల ద్వారా పశుసంపదకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. వెటర్నరీ పాలీ క్లినిక్ ద్వారా అత్యవసర కేసులకు అవసరమైన సర్జరీ, లేకపోతే చికిత్స చేసి కాపాడుతున్నారు. ఇందులో పేడ, రక్త పరీక్షలు నిర్వహించి అక్కడికక్కడే అవసరమైన వైద్యం అందిస్తున్నాం. రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ బేబీరాణి, పశుసంవర్ధక శాఖ జేడీ

అంబులెన్సులోనే ఆపరేషన్లు



పశుపోషకులు 1962 నంబరుకు కాల్ చేస్తే గంట లోనే ఆ గ్రామానికి చేరుకొని పరీక్షలు నిర్వహించి, అవసరమైతే పరీక్షలు చేసి వ్యాధిని అక్కడికక్కడే నిర్ధారించి చికిత్స చేస్తున్నారు. అలా సాధ్యం కానప్పుడు ఇందులోనే ఏరియా వెటర్నరీ హాస్పిటల్ లేదా బహుళార్ధ పశువైద్యశాలలకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ సుధీర్‌బాబు, పశుసంవర్ధక శాఖ ఏడీ, టంగుటూరు

పాడి రైతులకు ప్రభుత్వం అండ



ప్రభుత్వం 104, 108 వాహనాలతో ఎంతో మంది ప్రాణాలు కాపాడుతోంది. నోరులేని మూగజీవాల ఆరోగ్య పరిరక్షణకు కూడా అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ రథాలతో ఫోన్ చేసిన గంట వ్యవధిలో చికిత్స అందించి పాడి రైతులకు అండగా నిలుస్తోంది.

– వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి

సకాలంలో వైద్య సేవలు అందించారు



గేదె మేత మేయక, నీరు తాగక ఇబ్బంది పడుతుంటే సమీప పశు వైద్యశాలకు తరలించే పరిస్థితి కూడా లేదు. వెంటనే 1962 నంబరుకు ఫోను చేశా. 15 నిమిషాల్లోనే అంబులెన్సు మా గ్రామానికి వచ్చింది. గేదెను పరిశీలించి ఆ జబ్బుకు సంబంధించి చికిత్స చేసి ఇంజెక్షన్లు, మందులు అందించారు.

– అన్నవరపు జాలయ్య, పుల్లారెడ్డిపాలెం, ఆలకూరపాడు పంచాయతీ, టంగుటూరు

జేఈఈ అడ్వాన్స్‌లో మెరిశారు..



ధీరావత్ మాలిక్



బి.చంద్రమౌళినాయక్



యూషఫ్ షరీఫ్



ధనేకుల జయప్రకాష్



ఇ.హాసిని



నిహార్ చౌదరి



వెంకట అభినయ్



శివసాయిచరణ్‌తేజ

సాక్షి నెట్‌వర్క్: జేఈఈ అడ్వాన్స్ ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లావాసులు పలువురు సత్తాచాటి మంచి ర్యాంకులు సాధించారు.

- తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు జవహర్ నవోదయ 2 విద్యార్థి ధీరావత్ మాలిక్ ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరీలో 20వ ర్యాంకు, సీఆర్ఎల్ ర్యాంకు 2733 సాధించాడు. బేస్తవారిపేటకు చెందిన ధీరావత్ మాలిక్ తల్లిదండ్రులు వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని ధీరావత్ మాలిక్ తెలిపారు.
- పుల్లలచెరువు గిరిజన తండాకు చెందిన విద్యార్థి బాణావత్ చంద్రమౌళినాయక్ జేఈఈ అడ్వాన్స్‌లో జాతీయ స్థాయి ఎస్టీ కేటగిరీలో 213వ ర్యాంకు సాధించాడు. అతని తండ్రి వెంకటేశ్వరనాయక్ పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఇతని అన్న సాయిసందీప్‌నాయక్ గత ఏడాది జేఈఈ అడ్వాన్స్‌లో మంచి ర్యాంకు సాధించి భువనేశ్వర్‌లో ఐఐటీ చదువుతున్నాడు. గిరిజన తండా నుంచి వచ్చి మంచి ర్యాంకు సాధించిన చంద్రమౌళినాయక్‌ను తండావాసులు, ఉపాధ్యాయులు అభినందించారు.
- మార్కాపురానికి చెందిన షేక్ ఆసిమ్ షరీఫ్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 235వ ర్యాంకు సాధించాడు. అతని తండ్రి యూషఫ్ షరీఫ్ అమ్మనిగుడిపాడు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు కాగా, తల్లి అమిరున్నీసాబేగం ఓబులక్కపల్లి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు. బీటెక్ చదివి పరిశోధన రంగంలో రాణించాలని కోరుకుంటున్నట్లు ఆసిమ్ షరీఫ్ తెలిపాడు.
- సింగరాయకొండ మండలం శానంపూడికి చెందిన ధనేకుల జయప్రకాష్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఓబీసీ కేటగిరీలో 242వ ర్యాంకు సాధించాడు. అతని తండ్రి బలరామయ్య పీసీపల్లి మండలం మురుగమ్మి ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సీఎస్‌సీలో ఇంజినీరింగ్ పూర్తిచేసి సివిల్స్ సాధించడమే లక్ష్యమని జయప్రకాష్ తెలిపాడు.
- జరుగుమల్లి మండలం రెడ్డిపాలేనికి చెందిన ఇ.హాసిని జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆలిండియా జనరల్ కేటగిరీలో 387వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 59వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఐఐటీలో చదివి మంచి ఇంజినీరుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన లక్ష్యమని హాసిని తెలిపింది.
- జరుగుమల్లి మండలం వర్ధినేనివారిపాలేనికి చెందిన వై హనుమా నిహార్ చౌదరి జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆలిండియా జనరల్ కేటగిరీలో 389వ ర్యాంకు సాధించాడు. అతని తండ్రి వై.శ్రీనివాసులు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఐఐటీలో ఇంజినీరింగ్ చదవాలన్న నా కల తీరుతోందని నిహార్ సంతోషంగా తెలిపాడు.
- దర్శికి చెందిన గొర్రెపాటి జయచంద్ర వెంకట అభినయ్ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 2432వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 415వ ర్యాంకు సాధించాడు. అతని తండ్రి వేణు కట్టుశింగన్నపాలెంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. ఐఐటీలో సీఎస్ఈ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేయాలన్నదే తన లక్ష్యమని అభినయ్ తెలిపాడు.
- పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామానికి చెందిన చిన్నకొండలు కుమారుడు శివసాయిచరణ్ తేజ జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 642వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో చదివి ఇంజినీరింగ్ పూర్తిచేసి సివిల్స్ సాధించడమే లక్ష్యమని చరణ్ తేజ తెలిపాడు.

రక్త నాళాల చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్‌ఓసీ



ఎల్‌ఓసీని పంపిణీ చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రక్త నాళాల చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్‌ఓసీని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అందచేశారు. పట్టణానికి చెందిన షేక్ సుభాని రక్త నాళాల వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆయన చికిత్స చేయించుకోలేక పోతున్న విషయాన్ని గుర్తించిన మంత్రి ప్రభుత్వ పరంగా రూ.2 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం రాత్రి పెద్దారవీడు మండలంలోని తంగిరాలపల్లెలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎల్‌వోసీని మంత్రి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో యర్రగొండపాలెం, పెద్దారవీడు మండలాల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సంఘం నాయకుడు షేక్ అబ్దుల్ మజీద్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, నాయకులు షేక్ వలి, డి.కాశిరెడ్డి, షేక్ ఖాసిం పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం

- రూ.77 లక్షల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభం
- గడప గడపలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్, శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నిరంతరం అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేద్దామని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ఎల్.పురం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బూచేపల్లి వెంకాయమ్మతో పాటు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను పలకరిస్తూ ఇంటింటికీ పథకాల బుక్‌లెట్లు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులనుద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల రూపంలో కనీసం రూ.3 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తొలుత ఆర్.ఎల్.పురం పంచాయతీ పరిధిలో 2019 నుంచి ఇప్పటి వరకు చేసిన రూ.77 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులను బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఎస్వీఎస్ నగర్ వాసులు తాము నివాసం ఉంటున్న స్థలాల్లో ఇళ్లు కట్టుకోవడానికి కావాల్సిన పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారితో పాటు రామతీర్థం సమీపంలోనున్న కాలనీ వాసులు ఇళ్లు నిర్మించుకునేందుకు పంచాయతీ నిధుల నుంచి రుణాలను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత అతిథులకు స్థానిక సర్పంచ్ పుల్లగూర రమణమ్మ, ఎంపీటీసీ సభ్యుడు వంకాయలపాటి అహరోను, వైస్ ప్రెసిడెంట్ గోగినేని పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పమిడి నరశింహారావు, గోగినేని తిరిపాలు, ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మండలంలోని పలు గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, చీమకుర్తి పట్టణ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి సహకరిస్తా



మసీదు నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

టంగుటూరు: మసీదు నిర్మాణానికి సహకరిస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కొణిజేడు గ్రామంలో మసీదుకు ఆదివారం బాలినేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని, మసీదులు నిర్మాణానికి సైతం అందిస్తున్నారన్నారు. జగనన్న ప్రభుత్వం కుల, మతాలకు అతీతంగా అన్నీ మతాలకు సమ న్యాయం చేస్తోందన్నారు. మసీదు నిర్మాణం ప్రారంభించి, త్వరలో పూర్తిచేయాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయ నిర్మాణానికి స్థలాలను బాలినేని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి గుంజి వెంకయ్య, ఎంపీటీసీ బుర్రా అంకరాజు, ఈదా వెంకటరెడ్డి, కొణిజేడు సొసైటీ అధ్యక్షుడు బాలినేని వెంకటేశ్వరరెడ్డి, బాలినేని బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అండర్ 19 జిల్లా క్రికెట్ క్రీడాకారులు వీరే



ఎంపికైన క్రికెట్ క్రీడాకారులు

ఒంగోలు: అండర్ 19 ప్రకాశం జిల్లా క్రికెట్ ప్రాబబుల్స్ బాలుర జట్టు ఎంపిక ఆదివారం స్థానిక మంగమూరు రోడ్డులోని ఏసీఏ మినీ లార్డ్స్‌లో నిర్వహించారు. చైర్మన్ ఎస్.గీత, కన్వీనర్ ఎం.వీరరాఘవరెడ్డి నేతృత్వంలో కళ్యాణ్ పుష్యప్, సీహెచ్ విజయ్‌కుమార్ సెలక్టర్లుగా వ్యవహరించి 31 మంది క్రీడాకారులతో ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేశారు. బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్ విభాగాల్లో క్రీడాకారులను పరిశీలించారు. మొత్తం 92 మంది హాజరుకాగా వారిలో 31 మందికి ప్రాబబుల్స్ జాబితాలో చోటు లభించింది.

జిల్లా ప్రాబబుల్స్ జట్టు:
సీహెచ్ పవన్‌కార్తికేయ, కె.ఆనంద్, ఎస్‌కే మహబూబ్ సుభాని, పి.దుర్గాబాలాజీ, కె.సాత్విక్, ఎం.అభినవ్, పి.సాయినందకిషోర్, ఆర్.గిరీష్, జె.విష్ణుదత్త, ఎం.జయంత్‌సాయి, ఎస్.అఖిల్, బి.సాయిఅభిరామ్, డి.అభిలాష్, ఎం.హరిబాబు, కె.హర్షవర్ధన్, ఆర్.ప్రసుదీప్, ఎస్ఎస్ ప్రణవ్ చంద్ర, ఎస్‌కే ఇర్ఫాన్, టి.అనీల్ కుమార్, ఓ.వెంకట యాదవ్, ఎం.సుమంత్, కె.మహన్ సాయి, అబ్దుల్ ముక్తదీర్, ఎస్వి పవన్‌కుమార్, ఎ.అభిషేక్, జి.సాయిబాల ప్రసాదరావు, జీజీ పార్థసారధి, కె.వెంకట నాగరవి, టి.కౌశల్, టి.ఉజ్వల్, ఎస్‌కే ఖాజా.

క్లుప్తంగా

ఎలుకల మందు తిని మహిళ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కొత్తపట్నం: మనస్తాపంతో ఎలుకల మందు తిని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని రెడ్డిపాలెంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన గాలి శ్రావణి (30) వ్యవసాయ కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంది. శ్రావణి కుమార్తె ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపం చెందిన శ్రావణి ఈ నెల 12న ఎలుకల మందు తిని వాంతులు చేసుకుంది. దీంతో భర్త వెంకటేశ్వర్లు గమనించి ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఎస్సై బి.సాంబశివరావు వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాలట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి



సంఘటన స్థలంలో మణికంఠ మృతదేహం

ఒంగోలు టౌన్: పాలట్యాంకర్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడు మృతి చెందిన సంఘటన స్థానిక పేర్నమిట్ట వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతనూతలపాడు గ్రామానికి చెందిన అడక మణికంఠ (21) పదో తరగతి వరకు చదువుకుని ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఒంగోలు నుంచి బైకుపై సంతనూతలపాడు వెళ్తున్నాడు. మార్గం మధ్యలో పేర్నమిట్ట ఇందిరానగర్‌లోని కొండ పైకి వెళ్లేదారిలో పాల ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. పాలట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వలనే ప్రమాదం జరిగిందని మృతుడి తండ్రి అడక శ్రీను తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని నంద్యాల కర్నూలు హైవే రోడ్డు సమీపాన పొలాలో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. మహమ్మదాపురం రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో పశు కాపర్లు గుర్తించగా కుళ్లి దుర్వాసన వస్తున్న వృద్ధురాలి కనిపించింది. దీంతో వీఆర్ఓ పోలీసులకు సమాచారం అందించగా. వారు సంఘటనా వెళ్లి పరిశీలించారు. మృతురాలిది తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొర్రి పుల్లమ్మ(90)గా ఆమె వద్ద పెన్షన్ కార్డు ఆధారంగా గుర్తించారు. ఒంగోలులో ఉంటున్న పెద్ద మనుమడు చింతం కాశయ్య వద్ద ఉంటుంది. ఈ నెల 15 తేదీన స్వగ్రామం తర్లుపాడు వెళ్లేందుకు ఒంగోలు నుంచి వచ్చింది. అయితే మతిస్థిమితం సరిగ్గా లేక తాడివారిపల్లి వద్ద బస్సు దిగాల్సి ఆమె మహమ్మదాపురం వద్ద హైవేలో దిగి మహమ్మదాపురం వెళ్లే రోడ్డున వచ్చింది. ఎండ తీవ్రతకు రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో చెట్ల నీడన పడుకొని ఎండ వేడిమికి మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఐదు గేదెలు మృతి

● రూ.4.70 లక్షల నష్టం అంచనా

నాగులుప్పలపాడు: గాలికి కిందకు పడిపోయిన విద్యుత్ తీగలు తగిలి 5 గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం అమ్మనబ్రోలులో జరిగింది. గేదెల యజమాని, గ్రామస్తుల సమాచారం మేరకు అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన నువ్వుల శివయ్యకు చెందిన గేదెలు ఉదయాన్నే మేత కోసం పొలానికి వదిలారు. ఈ క్రమంలో గుండ్లకమ్మ కాలువలో నీటిని తాగేందుకు గేదెలు కాలువలోకి దిగే క్రమంలో ఇటీవల బాగా వీచిన గాలులకు సమీపంలోని విద్యుత్ తీగలు కిందకు పడిపోవడంతో ఆ తీగలు తగిలి 5 గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ప్రమాద స్థలాన్ని అమ్మనబ్రోలు పశు వైద్యశాల వైద్యురాలు డాక్టర్ మౌనిక పరిశీలించారు. వీటి విలువ రూ.4.70లక్షలు ఉంటుందని అంచనా వేశారు. అనంతరం పంచనామా నిర్వహించారు.



విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన గేదెలు

ఇంటర్ అర్హతతోనే
ఉద్యోగాలు శుభపరిణామం



మాట్లాడుతున్న ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ లోకనాథం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

● హెచ్‌సీఎల్ కంపెనీ ఏపీ హెడ్ అనిల్

ఒంగోలు: ఇంటర్ అర్హతతోనే ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ హెచ్‌సీఎల్‌లో ఉద్యోగాలకు ఎంపికవడం విద్యార్థులు చేసుకున్న అదృష్టమని ఆ కంపెనీ ఏపీ హెడ్ అనిల్ అన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో ఆదివారం ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్పెషల్ డ్రైవ్‌కు విద్యార్థులు హాజరై అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. అందరూ కష్టపడి కంపెనీలో పనిచేసి ఆత్మవిశ్వాసం, పట్టుదలతో రాణించి కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకునేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆర్.లోకనాథం మాట్లాడుతూ ఇంటర్ స్థాయిలోనే టెక్నికల్ ఉద్యోగాలకు చిన్నారులు ఎంపికవడం శుభపరిణామం అన్నారు. అందుకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వలంటీర్లు, వెల్ఫేర్ సెక్రటరీల నుంచి గత నెలన్నరగా సమాచారం తెప్పించుకుంటూ ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ చూపిన ప్రత్యేక శ్రద్ధ మరువలేనిదన్నారు. సోమవారం మార్కాపురం డివిజన్‌కు సంబంధించి డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కాలేజీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇదే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించిన ఆసక్తి గల యువత నేరుగా పాల్గొనవచ్చన్నారు. ఆదివారం ఒంగోలు శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆన్‌లైన్ పరీక్షకు 143 మంది హాజరవగా, వారిలో 68 మంది అర్హత సాధించారు. వారిలో 19 మంది విజయం సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ హెచ్‌ఆర్ సిబ్బంది, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ షేక్ బాషా, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో గల్లంతై గ్రానైట్ కార్మికుడు మృతి



మృతిచెందిన లాల్‌రామ్



ఆరుగురు రాజస్థాన్ యువకులకు ముందుగా జాగ్రత్తలు చెబుతున్న ఏఎస్సై రవి

కొత్తపట్నం: సముద్రస్నానానికి వెళ్లి గల్లంతై గ్రానైట్ కార్మికుడు మృతిచెందిన సంఘటన కొత్తపట్నం బీచ్‌లో ఆదివారం జరిగింది. రాజస్థాన్ రాష్ట్రం నాగూర్ మండల కేంద్రానికి చెందిన లాల్‌రామ్ (22) చీమకుర్తిలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తుంటాడు. ఆదివారం సెలవు కావడంతో మునిరామ్ గణపతిరామ్, ముఖేష్ భవనల్‌లాల్, లాల్‌రామ్, మరో ముగ్గురు కలిసి కొత్తపట్నం బీచ్‌కు వెళ్లారు. వారంతా కొద్దిసేపు తీరంలో సంతోషంగా గడిపారు. అనంతరం సముద్రంలో స్నానానికి దిగారు. కొద్దిసేపు మునిగి ముగ్గురు బయటకు వచ్చారు. మిగిలిన వారు మునుగుతుండగా అలలు ఉధృతంగా వచ్చి లోనికి కొట్టుకుపోయారు. వారిలో గణపతిరామ్, భవనల్‌లాల్ సురక్షితంగా బయటపడ్డారు. లాల్‌రామ్ మాత్రం గల్లంతై కొద్దిసేపటికి మృతి చెంది ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు కాపాడేందుకు ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.

పోలీసులు చెప్పినా వినకుండా...

రాజస్థాన్‌కు చెందిన ఆరుగురు యువకులు బీచ్‌కు రాగానే అక్కడే ఉన్న ఏఎస్సై రవి వారికి జాగ్రత్తలు చెప్పారు. లోతు తక్కువగా ఉన్నచోటే మునగాలని, ఎక్కువ లోతుకు వెళ్లవద్దని సూచించారు. ఆయన చెప్పింది విన్నట్టుగానే విని అనంతరం ఎక్కువ లోతుకు వెళ్లడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తీరంలో పోలీసులు ఎంత చెప్పినా వినకపోవడం, మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తున్నా పట్టించుకోకపోవడం వలనే ఇలాంటి మరణాలు సంభవిస్తున్నాయని, జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

సత్తాచాటిన బల్లికురవ ఎడ్ల జత



బండ లాగుతున్న ఎడ్ల జత

పామూరు: మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాలెం, రఘునాథపురం గ్రామాల సమీపంలో గల శ్రీఅచ్చమాంబ పేరంటాలు తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన ఎడ్ల జత ప్రథమస్థానంలో నిలిచింది. పోటీల్లో మొత్తం 5 జతల ఎడ్లు పాల్గొనగా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్ల జత నిర్దేశిత సమయంలో 4,016 అడుగులు లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. పావులూరి వీరాస్వామి, బత్తుల బాలరాజుకు చెందిన మరో ఎడ్ల జత 4 వేల అడుగులు లాగి ద్వితీయస్థానంలో, ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జత 3,673 అడుగులు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ కడప జిల్లా కాశినాయన మండలం ఆనంవారిపల్లెకు చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్ల జత 3,636.6 అడుగులతో నాలుగో స్థానంలో నిలిచింది. బేస్తవారిపేట మండలం జేసీ గ్రహారం గ్రామానికి చెందిన లక్కు నాగ శివకుమార్ ఎడ్ల జత 3,003.7 అడుగులు లాగి 5వ స్థానంలో నిలిచింది. విజేతలకు మొదటి బహుమతిగా రూ.40 వేలను కాట మధుసూదన్‌రావు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలను బొల్లిపల్లి మహేంద్రబాబు, తృతీయ బహుమతిగా రూ.20 వేలను దుద్దుకూరి మాల్యాద్రి, నాలుగో బహుమతిగా రూ.10 వేలను శ్రీశైల శ్రీకార్తికేయ, ఐదో బహుమతిగా రూ.5 వేలను దేవస్థాన కమిటీకి చెందిన అడుసుమల్లి చెంచయ్య, నరసింహులు, తిరుపతయ్య, మల్లికార్జున, దుద్దుకూరి యోగానంద్, రావెళ్ల వెంకటరత్నం చేతుల మీదుగా అందజేశారు.

భార్యతో విభేదాలు.. ఆస్ట్రేలియాకు భర్త జంప్!

● అదనపు కట్నం కోసం వేధించారని భార్య ఫిర్యాదు
● కేసు దర్యాప్తు చేస్తున్న ఒంగోలు తాలూకా పోలీసులు

ఒంగోలు టౌన్: అదనపు కట్నం కోసం వేధించడమే కాకుండా తనకు తెలియకుండా తన భర్త ఆస్ట్రేలియా వెళ్లిపోయాడని ఓ వివాహిత ఆదివారం ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన తుమాటి మనీషాకు నెల్లూరు జిల్లా కావలికి చెందిన నాతాని వెంకటేష్‌తో గత ఏడాది ఫిబ్రవరిలో పెద్దల సమక్షంలో వివాహమైంది. వివాహ సమయంలో రూ.1.30 కోట్ల విలువ చేసే పొలంతో పాటుగా ఆడపడుచు కట్నం, పెళ్లి ఖర్చులు, బంగారం నగలు కలిపి రూ.15 లక్షలు ముట్టచెప్పారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడని పెళ్లి కుమారుడికి అడిగినంత ఇచ్చి పెళ్లి చేశారు. కావలిలో కాపురం పెట్టిన తరువాత అత్తామామలు నాతాని యానాది నాయుడు, అరుణలతో పాటుగా ఆడపడచు కంఠమణి వెంకట శేషమ్మ అలియాస్ శైలజలు సూటిపోటి మాటలతో వేధించడం మొదలు పెట్టారు. భోజనం కూడా పెట్టకుండా కొట్టేవారు. దీంతో మద్దిరాలపాడు గ్రామంలో కాపురం పెట్టారు. సజావుగా కాపురం కొనసాగుతున్న సమయంలో అత్తామామలు, ఆడపడచులు వచ్చి భార్యాభర్తల మధ్య గొడవలు సృష్టించారు. రూ.20 లక్షలు అదనపు కట్నం తెస్తేనే కావలికి కాపురానికి తీసుకొని వెళతామని చెప్పి వెంకటేష్‌ను వెంట తీసుకెళ్లారు. వీరితో పాటుగా భర్త బంధువులైన మద్దినేని శ్రీహరి, శ్యామలాదేవిలు పదే పదే మనీషా ఇంటికి వచ్చి వెంకటేశ్‌కు విడాకులు ఇస్తే రూ.30 లక్షలకు సెటిల్ చేస్తామని నచ్చచెప్పే ప్రయత్నాలు చేశారు. వెంకటేశ్‌కు భార్య ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. గత సంవత్సరం ఆగస్టులోనే వెంకటేశ్ తనకు చెప్పాకుండా ఆస్ట్రేలియా వెళ్లిపోయినట్లు తెలిసిందని భార్య మనీషా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కనిగిరి శివారులో వ్యక్తి మృతి



పాచ్ఛాహుస్సేన్ (ఫైల్ ఫొటో)

కనిగిరి రూరల్: స్థానిక గార్లపేట రోడ్డులోని శివారు ప్రాంతమైన అనపకాయల బొంది కొండ (భ్రమరాంబ వెంచర్) సమీపంలో నిర్మానుష్య ప్రాంతంలో ఎస్‌కే పాచ్ఛాహుస్సేన్ (48) మృతి చెందాడు. పట్టణంలోని ఇందిరాకాలనీ స్థూపంబజార్‌కు చెందిన పాచ్ఛాహుస్సేన్ మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటాడు. ఆదివారం సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పాచ్ఛాహుస్సేన్‌గా నిర్ధారించారు. మృతుడి శరీరంపై ప్యాంటు, డ్రాయర్ లేకపోగా, మృతదేహం పక్కన పాస్‌పోర్ట్ సైజు ఫొటో ఉంది. పాచ్ఛాహుస్సేన్ వడదెబ్బ తగిలి చనిపోయాడా.. లేక హార్ట్ స్ట్రోక్, ఇతర అనారోగ్యంతో చనిపోయాడా అనేది విచారణలో తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు ఎటువంటి అనుమానం వ్యక్తం చేయడం లేదని ఎస్సై డి.ప్రసాద్ తెలిపారు.

మానవత్వం చాటిన పోలీసులు

● తప్పిపోయిన వృద్ధురాలిని ఇంటికి చేర్చిన వైనం



లక్ష్మమ్మను బంధువుకు అప్పగిస్తున్న ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా

సింగరాయకొండ: తన మనవళ్లు, మరికొందరితో కలిసి తిరుపతి వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన వృద్ధురాలు తప్పిపోయింది. ఒంటరిగా బస్సు ఎక్కి సింగరాయకొండ చేరింది. స్థానిక పోలీసులు స్పందించి ఆమెను బంధువుల వద్దకు చేర్చారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. సింగరాయకొండ ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా కథనం ప్రకారం.. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం వలసంపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు సద్దల లక్ష్మమ్మ తన మనవళ్లతో కలిసి మొత్తం 15 మంది ఈ నెల 13వ తేదీ తిరుపతి వెళ్లారు. బుధవారం తిరుపతి చేరుకున్న వీరంతా శనివారం స్వామివారి దర్శనం చేసుకుని లడ్డూ ప్రసాదం కోసం వెళ్లేటప్పుడు అక్కడ ఒక ప్రాంతంలో కూర్చోమని లక్ష్మమ్మను చెప్పారు. ఆ తర్వాత లక్ష్మమ్మ ఏదో పనిమీద పక్కకు వచ్చి మళ్లీ తాను కూర్చున్న ప్రదేశానికి వెళ్లే క్రమంలో తప్పిపోయింది. చివరికి తన వద్ద ఉన్న డబ్బుతో బస్సు ఎక్కి తిరుపతి చేరింది. అనంతరం విజయవాడ వెళ్లే బస్సు ఎక్కగా బస్సు కండక్టర్ ఆమె వద్ద ఉన్న రూ.200కు సింగరాయకొండ వరకు టికెట్ ఇచ్చి శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో దించాడు. అనంతరం ఎటు వెళ్లాలో తెలియక చివరికి మూలగుంటపాడు ప్రాంతానికి వెళ్లడంతో నరాల సుధాకర్ అనే వ్యక్తి ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టి వివరాలు తెలుసుకున్నాడు. రాత్రికి తన ఇంటి వద్దే ఉంచుకుని ఆదివారం ఉదయం ఎస్సైకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఫిరోజ్ ఫాతిమా ఆమె పూర్తి వివరాలు తెలుసుకుని కొయ్యూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై ఫోన్ నంబర్ సేకరించి అతనికి ఫోన్ చేసి ఆ ఊరి పెద్దలకు సమాచారం అందించారు. లక్ష్మమ్మ చెప్పిన వివరాల ప్రకారం అక్కడి వారి ఇంటికి వెళ్లిన ఆ గ్రామ పెద్దలు.. తిరుపతిలోనే ఆమెను వెతుకుతూ ఉండిపోయిన మనవడు ఫోన్ నంబర్ సేకరించి ఎస్సైకు చెప్పారు. దీంతో ఎస్సై ఫాతిమా ఆ ఫోన్ నంబర్ ప్రకారం లక్ష్మమ్మ మనవడికి ఫోన్ చేశారు. ఆమె తన వద్ద ఉందని చెప్పడంతో మనవడు కొండలు వెంటనే గూడూరు సమీపంలో నివసిస్తున్న తన బంధువులకు సమాచారం అందించారు. శివసాయి దుర్గాప్రసాద్ అనే యువకుడిని లక్ష్మమ్మ వద్దకు పంపారు. తన వద్దకు వచ్చిన దుర్గాప్రసాద్‌కు లక్ష్మమ్మను ఎస్సై ఫిరోజ్‌ఫాతిమా అప్పగించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మానవత్వం చూపి వృద్ధురాలిని బంధువుల వద్దకు చేర్చిన ఎస్సై ఫాతిమాను, ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషాను ప్రజలు అభినందించారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళ్తూ మృత్యువాత



మృతిచెందిన కాశీనాగేశ్వరరావు

బేస్తవారిపేట: మొక్కు తీర్చుకునేందుకు వెళుతూ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పూసలపాడు సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డుపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..కొమరోలు మండలం రెడ్డిచర్లకు చెందిన కేతిగాళ్ల కాశీనాగేశ్వరరావు(21) కంభానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న సమయంలో నరసరావుపేట నుంచి గుంతకల్‌కు దీపారాధన నూనె బాటిళ్ల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో నాగేశ్వరరావు తల రోడ్డు బలంగా తగలడంతో తీవ్ర గాయాలతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న గుంతలో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు.

ఇంటి నుంచి బయలుదేరిన గంటకే..

కాశీనాగేశ్వరరావు ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. నంద్యాల జిల్లాలోని కొత్తూరులో కంభంలోని స్నేహితున్ని ఎక్కించుకుని గుడికి వెళ్లడం కోసం ఇంటి నుంచి బయలుదేరాడు. ఇంటినుంచి బయటకు వచ్చిన గంటకే మృత్యువాతపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్నా కుమారుడి మరణంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

లక్ష్య నిర్దేశాలపై అవగాహన అవసరం

● అధ్యాపకులతో డాక్టర్ పద్మజ



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పద్మజ

ఒంగోలు: లక్ష్య నిర్దేశాలపై అధ్యాపకులకు అవగాహన అవసరమని గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.పద్మజ అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్య నిర్దేశాలు, ప్రోగ్రాం లక్ష్య నిర్దేశాలను ఏ విధంగా జత కలపాలో సోదాహరణంగా వివరించారు. న్యాక్ అదనపు కో ఆర్డినేటర్ డాక్టర్ మున్నంగి శ్రీనివాసరెడ్డి, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ గణిత అధ్యాపకురాలు పి.నిర్మలకుమారి కోర్సు లక్ష్య నిర్దేశాలు, ప్రోగ్రాం లక్ష్య నిర్దేశాలు ఏ విధంగా లెక్కించాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సదస్సును ఒకసారి ఆన్‌లైన్‌లో, మరోసారి ఆఫ్‌లైన్‌లో నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 210 మంది హాజరవగా, ఆఫ్‌లైన్‌లో 50 మంది హాజరయ్యారు. గంటపాటు అనుమాన నివృత్తిపై చర్చ కొనసాగించారు. కార్యక్రమంలో డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అట్టహాసంగా టౌన్‌షిప్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గరటయ్య, నిర్వాహకులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల దక్షిణ బైపాస్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన భ్రమర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ ఆవరణలో భ్రమర గ్రోత్‌సిటీ పేరుతో ఓ నూతన ప్రాజెక్టు నిర్మాణం కోసం బ్రోచర్ ఆవిష్కరణను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనసభ్యుడు బాచిన చెంచుగరటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మారుతున్న వాతావరణానికి అనుగుణంగా విశాలవంతమైన ప్రదేశంలో అన్ని వసతులతో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ గ్రోత్‌సిటీ పేరుతో నూతన నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. హైవేకు ఆనుకొని గ్రోత్‌సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు.

కార్యక్రమంలో టౌన్‌షిప్ ఎండీ గల్లా రామచంద్రరావు, డైరెక్టర్లు మారం చంద్రశేఖర్, ఎంఎస్.రాజు, శైలారెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మ్యాట్రిమోనీ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి

ఒంగోలు టౌన్: పెళ్లి కాని యువతీ యువకులను టార్గెట్ చేసుకుని మోసాలకు పాల్పడుతున్న వారి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మ్యాట్రిమోనీ సైట్లలో ప్రొఫైల్ నచ్చిందంటూ మాటలు కలిపి అవసరాలు ఉన్నాయంటూ డబ్బు, నగలు వసూలు చేయడం, ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లి చేసుకోవడం, పెళ్లయ్యాక నగలు, నగదు తీసుకుని పారిపోవడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. విదేశీ సంబంధం, మంచి ఉద్యోగం, ఆర్థికంగా స్థిరపడినవారు, లైఫ్ సెటిల్ అవుతుందన్న భావనలో కొందరు తల్లిదండ్రులు మోసగాళ్ల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మ్యాట్రిమోనీలో తెలిపే వివరాలు వాస్తవమో.. కాదో ఒకటికి రెండుసార్లు విచారించి నిర్ధారించుకోవాలని చెప్పారు. పెళ్లి కాకుండానే ఆర్థిక లావాదేవీలు జరపడం మంచిది కాదన్నారు. ఏదైనా మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలని ఎస్పీ కోరారు.

మంచి మాట



సాధించాల్సిన లక్షణం ఐకమత్యం

ఐకమత్యంతో ఉండడం, మానవులు కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవడం, మనుషుల్లో సమానత్వం అనేవి ప్రస్తుత పరిస్థితిలో మన సంఘానికి, దేశానికి, ప్రపంచానికి ఎంతో అవసరం. నిజానికి ఇవి ప్రస్తుతానికి మాత్రమే కాదు, ఎప్పటికీ తప్పకుండా అవసరం అయినవే. వర్తమానంలోలాగానే గతంలోనూ ఇవి నిజాయితీగానూ, నిజంగానూ మనలో చోటుచేసుకోలేదు. అందుకే మన వర్తమానం ఉండాల్సినంత ఫలవంతంగానూ, విజయవంతంగానూ లేదు. ఈ క్షేత్రవాస్తవాన్ని తెలుసుకుని మనం వీటిని ఆవాహన చేసుకోవాలి.

వేద వాఙ్మయంలోని సూక్తాల్లో సంవనన సూక్తం ఒకటి. ఇది ఋగ్వేదానికి చెందినదిగా చెప్పబడింది. కలిసికట్టుగా ఉండడం, కార్యోన్ముఖత్వం, సమానత్వం వీటిని ఉద్దేశిస్తూ, ఉవాచిస్తూ, ఉద్బోధిస్తూ సనాతన సాహిత్యం ఈ సంవనన సూక్తం ద్వారా విశ్వ మానవాళికి యుక్తమైన చింతనను అందజేస్తోంది. ఇకనైనా మనం ముందుకు వచ్చి దాన్ని అనుసరించాల్సి ఉంది.

'సంసమిద్యువసే వృషన్నగ్నే విశ్వాన్యర్య ఆ' అంటూ మంచిని కురిపించే దైవమైన అగ్నీ! విశ్వమంతా ఇక ఐకమత్యంతో ఉండేట్టు చెయ్యి అని ఐకమత్యం ఆవశ్యకతను గుర్తెరిగి సంవనన సూక్తం ప్రార్థన చేసింది. ఈ విశ్వంలోని మానవులకు లుప్తం కాకుండా కావాల్సింది ఏమిటి? అది ఐకమత్యం కాకపోతే ఇంకేమిటి?? మనం ఆ ఐకమత్యాన్ని ఆకాంక్షించి సాధించాలి.

> ఆలోచనలు ఒకటైతే బలం అన్న సార్వజనీనమైన, సార్వకాలికమైన, సకల శ్రేయస్కరమైన చింతనను మనం మస్తిష్కాల్లో సమ్మిళితం చేసుకోవాలి; మన అస్తిత్వానికి ప్రశాంతతను సమకూర్చుకుని సుఖంగానూ, సంతోషంగానూ జీవించాలి.

ఐకమత్యం తరువాత విశ్వమానవుల్ని కలిసికట్టుగా కార్యోన్ముఖులు అవండి, కలిసికట్టుగా మాట్లాడండి, మీ మనసుల్లో కలిసిపోయిన ఒకే అవగాహన నెలకొనాలి; మొదట్లో దేవతోపాసనలో ఏవిధంగా భాగమయ్యారో అలా కలిసికట్టుగా ఉండండి అని సూచిస్తూ 'సంగచ్ఛధ్వం సం వదధ్వం సం వో మానాంసి జానతామ్ దేవా భాగం యథా పూర్వే సంజానానా ఉపాసతే' అని తెలియజెప్పింది సంవనన సూక్తం.

ఐకమత్యం, కలిసికట్టుగా పనిచెయ్యడం తరువాత మానవుల్లో ఉండాల్సింది సమానత్వం. అందుకే 'సమానో మన్త్రః సమితిః సమానీ సమానం మనః సహ చిత్తమేషామ్ సమానం మన్త్రమభి మన్త్రయే వః సమానేన వో హవిషా జుహోమి' అంటూ మంత్రం అందరికీ సమానం, సభలు సమానత్వంతో ఉండాలి. మీ ఆలోచనలూ, చిత్తమూ సమానంగా ఉండాలి, మీ కోసం సమానంగా మంత్రాన్ని అభిమంత్రిస్తాం, మీ కోసం సమానంగా ఆహుతుల్తో ఆరాధిస్తాం అని సంవనన సూక్తం ద్రష్టలు గట్టిగా చాటారు.

అంటరానితనమో, భేద చింతనో వేదంలోనూ, సనాతన సాహిత్యంలోనూ లేదు అన్న సత్యాన్ని ఈ మాటల ద్వారా సరిగ్గా అర్థం చేసుకున్నాక, చక్కగా ఆకళింపు చేసుకున్నాక 'సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః సమానమస్తు వో మనో యథా వః సుసహాసతి' అంటూ మీ తలపులు లేదా సంకల్పాలు ఒకటే అయి ఉండాలి, మీ హృదయాల భావాలు ఒకటే అయి ఉండాలి, మీ ఆలోచనలు ఒక్కటై ఉండనీ. ఇలా మీలో మంచితనం బలం నెలకొనాలి అని సంవనన సూక్తం చేసిన దిశానిర్దేశాన్ని మనం అవగతం చేసుకోవాలి; అటుపై ఆచరణలోకి ఆహ్వానించి దాన్ని అమలులో నిలపాలి.


ఒక కుటుంబంలోని, ఒక సమాజంలోని, ఒక దేశంలోని, ఒక ప్రపంచంలోని మనుషుల్లో ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం ఈ మూడూ లేకపోవడంవల్ల జరుగుతున్న హానికి ప్రతి మనిషీ గురి అవుతున్నాడు; కలుగుతున్న నష్టానికి ప్రతి మనిషీ బలి అవుతున్నాడు. ఎప్పుడో కాదు ఇప్పటికిప్పుడు ముమ్మాటికీ ఆ మూడిటిని మనకు మనం అన్వయించుకోవాలి; ఉన్న, రానున్న ముప్పుల్ని లేకుండా చేసుకోవాలి. మునుపటి ప్రమాదాలకు ముగింపు పలికి ఐకమత్యం, కలిసికట్టుతనం, సమానత్వం వీటితో ప్రమోదంగా మనం మునుముందుకు సాగుతూ ఉండాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

నీ ఆకలి, నీ నిద్ర నీదే కదా... మరి..!!!



నీవు ఎదగలేకుండా పోవడానికి కారణం ఎవరు ? నీకు సలహాలిచ్చేవారికోసం, నీకు సహాయపడేవారి కోసం చూస్తున్నావా? నీకు బంధువులు లేరా? వాళ్ళు నిన్ను పట్టించుకోవడంలేదా? నీకు స్నేహితులు, శ్రేయోభిలాషులెవరూ లేరా? వారు నీకు మార్గదర్శనం చేయడం లేదా? లేక... నీకు శత్రువులు ఎక్కువగా ఉన్నారా? వాళ్లు నిన్ను ముందుకు పోనీయడం లేదా? అంటే ఎవరో రావాలనీ, వాళ్ళు నిన్ను జాగ్రత్తగా నడిపించాలనీ, నీ ప్రతి కష్టంలో వారు నీకు తోడుగా నిలబడి దిశానిర్దేశం చేయాలని నీవు కోరుకుంటున్నావని అర్థం... దీనికి జగద్గురువయిన కృష్ణ పరమాత్మ ఏమంటున్నాడో చూడండి...

''ఉద్ధరేద్ ఆత్మనాత్మానమ్ నాత్మానమ్ అవసాదయేత్, ఆత్మైవ హై ఆత్మనో బంధుర్ ఆత్మైవ రిపుర్ ఆత్మనః ''

– అంటే నీకు నీవే బంధువువు, నీకు నీవే స్నేహితుడివి, నీకు నీవే శత్రువివి. నీకు ఆకలివేస్తే నీవే తినాలి, నీకు నిద్రవస్తే నీవే నిద్ర పోవాలి, నీకు దాహం వేస్తే నీవే నీళ్లు తాగాలి...అలాగే నీకు కష్టం వచ్చినప్పుడు, నీకు సమస్యలు ఎదురయినప్పుడు ఎవరో వస్తారని, నిన్ను కటాక్షిస్తారని, నిన్ను ఉద్ధరిస్తారని ఎదురు చూస్తూ కూచోవద్దు. బంధువులు, స్నేహితులు, శత్రువులు బయట లేరు... నీలోనే ఉన్నారు. నీవు వారిని గుర్తిస్తే... నీకు ఇక ఏ చింతా ఉండదు. నీ నిద్ర నీవు పోయినట్లుగానే, నీ ఆకలి నీవు తీర్చుకున్నట్లుగానే... నీ కష్టాన్ని కూడా నీవే తీర్చుకుంటావు.

భగవంతుడు మనకు కొన్ని అద్భుతమయినవి ఇచ్చాడు. భువనం.. ఈ ప్రపంచాన్ని ఇచ్చాడు. నీ జీవితం వర్ధిల్లడానికి ప్రకృతిని ఇచ్చాడు. నీకు ఆహ్లాదమయినవి చూసి సంతోషించడానికి కళ్ళు ఇచ్చాడు.. నీకు ఇష్టమయినవి వినడానికి చెవులిచ్చాడు. తాకి అనుభూతి చెందడానికి చర్మానికి స్పర్శనిచ్చాడు. వాసనలు చూడడానికి ముక్కు ఇచ్చాడు... ఇలా చాలా ఇచ్చాడు... ఇవన్నీ నీకోసం, నీవు అనుభవించడానికే ఇచ్చాడు... అయితే ఇవన్నీ ధర్మచట్రంలో ఇమిడేటట్టు చూసుకోమన్నాడు... అంతే.. అదే చేసెయ్... ఇవన్నీ వదిలేసి మనసు పక్క చూపులు చూస్తున్నదనీ, ఎటో లాగుతున్నదనీ విచ్చలవిడిగా పోతే ... నీలో ఉన్న శత్రువును... నీవే ఉత్సాహపరిస్తే... నీ పతనానికి నీవే దారి ఏర్పాటు చేసుకుంటున్నట్లు అవుతుంది.

పిల్లలను కూర్చోబెట్టుకుని వారికి మంచీ చెడూ ఎలా చెబుతుంటావో... నీ మనసుకు కూడా ప్రతిరోజూ, ప్రతి క్షణం అలా చెబుతూ ఉండు... అప్పుడది నీకు ఆత్మ బంధువుగా మారుతుంది. నీ శ్రేయస్సు కోరే నీ స్నేహితుడిగా, నీ శ్రేయోభిలాషిగా నీకు మార్గదర్శనం చేస్తుంది. నీ కంటికి కనురెప్ప ఉంది. అది నీ కంటిని ఎలా కాపాడుతుంటుందో నీ మనసును అనుక్షణం నీవు అలా కాపాడుతుండాలి. అదే నిన్ను నీవు ఉద్ధరించుకోవడం– అని పరమాత్మ గీతాబోధ చేసాడు. ఇంతకన్నా చెప్పడానికి ఎవరికయినా ఏముంటుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

భాషా మాధుర్యం



ఆయన ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు. ఢిల్లీలో స్థిరపడాల్సి వచ్చింది. ఖాళీగా ఉండటం దేనికని ఇంటి గేటుకు 'తెలుగు నేర్పించబడును' అని బోర్డు పెట్టించాడు.

'ఇక్కడెవరు తెలుగు నేర్చుకుంటారు? మీకు పిచ్చి కాకపోతేను...' అని కుటుంబ సభ్యులు ఆట పట్టించినా పట్టించుకోలేదు. ఆరు నెలలు గడిచినా ఎవ్వరూ రాలేదు. అయినా ఆయన నిరాశ చెందలేదు. ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు వస్తారని, తెలుగు నేర్చుకుంటారని ఆశగా ఉండేవాడు.

ఆయన అనుకున్నట్టుగానే ఒక రోజు సాయంత్రం పడవలాంటి కారు ఇంటి ముందర వచ్చి నిలుచుంది. అందులో నుంచి, మంచి పేరున్న ఓ వృద్ధ హిందీ రచయిత దిగాడు. తెలుగు నేర్పమని కోరాడు. అందుకు సంతోషంగా సమ్మతిస్తూ ఎప్పుడెప్పుడు రావాలో, ఏయే పుస్తకాలు తెచ్చుకోవాలో...' లాంటివి చెప్పాడు తెలుగు పండితుడు.

అలాగేనని చెప్పి బయలుదేరుతున్న రచయితతో ''ఈ వయసులో మీకు తెలుగు నేర్చుకోవాలని ఎందుకు అనిపించింది?'' అని అడిగాడు.

''నేను ఈ మధ్యనే దక్షిణాది తీర్థయాత్రకు వెళ్లాను. యాత్రలో భాగంగా తిరుమలకొండ కూడా వెళ్లాను. అక్కడ వెంకటేశ్వర స్వామిని కీర్తిస్తూ రాసిన తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలు విన్నాను. గుండె లోలోతు పొరల్ని తాకాయి ఆ కీర్తనలు. తెలుగు భాష నేర్చుకుంటే అన్నమయ్య రచనల్ని మరింత లోతుగా పరిశీలించవచ్చని భావించాను. అందుకే మీ దగ్గర తెలుగు నేర్చుకోవాలనుకున్నాను'' అని బదులిచ్చాడు.

రచయిత మాటలు విన్న విశ్రాంత ఉపాధ్యాయుడి కళ్ళు తడి అయ్యాయి.

'అయ్యో... తెలుగువాడినై ఉండి నేను ఇప్పటివరకు అన్నమాచార్య కీర్తనలను ఆస్వాదించలేకపోయానే...' అని బాధపడ్డాడు.

ఒకపక్క ఆ రచయితకు తెలుగు పాఠాలు చెబుతూనే అన్నమయ్య గ్రంథాలను చదవడం, వినడం ప్రారంభించాడు. అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యాన్ని ఆస్వాదించసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా?


రవితేజ

రవితేజ యమా స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రాలు 'టైగర్ నాగేశ్వరరావు' అక్టోబరు 20న, 'ఈగిల్' జనవరిలో రిలీజ్ కానున్నాయి. అయితే ఈ చిత్రాల తర్వాత రవితేజ ఏ దర్శకుడితో సినిమా చేస్తారు? అనే చర్చ కొంతకాలంగా ఇండస్ట్రీలో వినిపిస్తోంది. గోపీచంద్ మలినేని, అనుదీప్ వంటి దర్శకుల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తాజాగా జీవీఆర్ వాసు చెప్పిన ఓ స్టోరీ లైన్‌కు రవితేజ ఇంప్రెస్ అయ్యారని, పూర్తి కథ విన్న తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై తుది నిర్ణయం తీసుకుంటారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనుందనే ప్రచారం కూడా జరుగుతోంది. మరి.. జీవీఆర్ వాసు కథకి రవితేజ ఫైనల్ గ్రీన్ సిగ్నల్ ఇస్తారా? లేదా? వేచి చూడాలి.

వారికి కాజల్ ఓ ఉదాహరణ

– దర్శకుడు శేఖర్ కమ్ముల

''మగధీర' సినిమాలో మిత్రవిందగా కాజల్ ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా హీరోయిన్స్ వారి కెరీర్‌ను కొనసాగించవచ్చనడానికి కాజల్ ఓ ఉదాహరణగా నిలుస్తున్నారు. 'సత్యభామ' సినిమా గ్లింప్స్ బాగుంది.. టీమ్‌కు ఆల్ ది బెస్ట్'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. అఖిల్ డేగల దర్శకత్వంలో అవురమ్ ఆర్ట్స్ పతాకంపై బాబీ తిక్క, శ్రీనివాస రావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం, జూన్ 19) కాజల్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'సత్యభామ' సినిమా గ్లింప్స్‌ని శేఖర్ కమ్ముల విడుదల చేశారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ– ''తెలుగుచిత్ర పరిశ్రమ నాకు ఇల్లు లాంటింది. తెలుగు ఆడియన్స్ బెస్ట్. వారి ప్రేమ, ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నా'' అన్నారు. ''నా తొలి సినిమాకు హీరోగా నిలిచిన కాజల్‌గారికి ధన్యవాదాలు'' అన్నారు అఖిల్ డేగల. ''మంచి చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తాం'' అన్నారు శ్రీనివాస్, బాబీ. ఈ కార్యక్రమంలో స్క్రీన్‌ప్లే, చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క, కథారచయితలు రమేష్, ప్రశాంత్, కెమెరామేన్ మోహిత్ కృష్ణ, క్రియేటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


శశికిరణ్, అఖిల్, శేఖర్ కమ్ముల, కాజల్, శ్రీనివాస రావు, బాబీ

నాన్‌స్టాప్‌గా నలభై రోజులు!


మహేశ్‌బాబు

'గుంటూరు కారం' సెట్స్‌లోకి మహేశ్‌బాబు మరోసారి అడుగుపెట్టడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'గుంటూరు కారం'. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల రెండో వారంలో ప్రారంభం కావాల్సి ఉంది. కానీ జూలై మొదటి వారంలో ప్రారంభించాలని యూనిట్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే జూలైలో ప్రారంభమయ్యే కొత్త షెడ్యూల్ చిత్రీకరణ నాన్‌స్టాప్‌గా దాదాపు 40రోజులకుపైగా జరుగుతుందనే టాక్ కూడా వినిపిస్తోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు గతంలో మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హారర్ సినిమాలు చేయకూడదనుకున్నా

– నందితా శ్వేత


అనూప్, నందితా శ్వేత, శంకర్, శంకర్ మార్తాండ్

''హారర్ చిత్రాల్లో నటించకూడదనుకున్నాను. కానీ 'ఓ మంచి ఘోస్ట్' సినిమా కథ నచ్చడంతో చేశాను. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హీరోయిన్ నందితా శ్వేత అన్నారు. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్, నవమి గాయక్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. అభినిక ఐనాభాతుని నిర్మించారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పాప నువ్వు తోపు..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. సింహాచలం లిరిక్స్ అందించిన ఈ పాటను బాలసూరన్న పాడారు. ఈ పాట విడుదల వేడుకలో శంకర్ మార్తాండ్ మాట్లాడుతూ– ''హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. హారర్ కథలకు మ్యూజిక్ చాలా ముఖ్యం.. అనూప్‌గారు ప్రాణం పెట్టి ఈ సినిమాకు సంగీతం అందించారు'' అన్నారు. ''ఓ పాప నువ్వు తోపు..' పాట ఆకట్టుకుంటుంది'' అన్నారు అనూప్ రూబెన్స్.

మా నాన్న సూపర్ హీరో!


సుధీర్‌బాబు


'మా నాన్న సూపర్ హీరో' అంటున్నారు సుధీర్ బాబు. 'లూజర్' వెబ్‌సిరీస్ ఫేమ్ అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రానికి 'మా నాన్న సూపర్ హీరో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మూవీలో ఆర్నా హీరోయిన్. సీఏఎం ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి వి సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 18) ఫాదర్స్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు మేకర్స్. ''తండ్రీకొడుకుల ప్రేమ, అనుబంధాలకు నిజమైన అర్థాన్ని తెలియజేసేలా 'మా నాన్న సూపర్ హీరో' ఉంటుంది. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో రాజు సుందరం ఓ కీలక పాత్రలో నటిస్తూనే, కొరియోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సాయిచంద్, సాయాజీ షిండే, శశాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జై క్రిష్, కెమెరా: సమీర్ కల్యాణి.

ఇదేం జీవితం?


రామకృష్ణ గౌడ్, సాయిప్రసన్న, శ్రీకాంత్

శ్రీకాంత్ గుర్రం, సాయిప్రసన్న జంటగా ఎస్ఎస్ శాస్త్రీ దర్శకత్వంలో 'ఇది ఏం జీవితం రా అయ్యా' సినిమా ప్రారంభమైంది. బొక్కిసం భూలక్ష్మి నిర్మిస్తున్నారు. హీరో హీరోయిన్లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ క్లాప్ ఇచ్చారు. ''మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రాజమండ్రి సమీపంలో షూటింగ్ జరుగుతుంది'' అన్నారు ఎస్ఎస్ శాస్త్రీ.

రాకేశ్ మాస్టర్ ఇకలేరు



తెలుగు చలన చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ నృత్య దర్శకుడు ఎస్.రామారావు అలియాస్ రాకేష్ మాస్టర్(53) ఆదివారం మృతిచెందారు. వారం క్రితం ఓ సినిమా షూటింగ్ కోసం విశాఖపట్నం, భీమవరం వెళ్లి వచ్చిన ఆయన అప్పటినుంచి అనారోగ్యం పాలయ్యారు. ఆదివారం రక్త విరోచనాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి ప్రాంతంలో రాకేష్ మాస్టర్ జన్మించారు. ఆయన అసలు పేరు ఎస్.రామారావు. 10 ఏళ్ల వయస్సులో డిస్కో డాన్స్ చూసి డ్యాన్సర్‌గా మారాలనుకున్నారు. కానీ, ఎక్కడ నేర్చుకోవాలి? ఎవరు నేర్పుతారు? అని తెలియక టీవీలో వచ్చే పాటలను చూసి డ్యాన్స్ నేర్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి టౌన్‌కి వెళ్లి ఓ డ్యాన్స్ స్కూల్ ప్రారంభించారు. తొలిరోజుల్లో కేవలం రూ.5 ఫీజుతో డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చేవారు. కొన్ని రోజుల తర్వాత సినిమా అవకాశాల కోసం చెన్నై వెళ్లారు. ఛాన్స్‌లు రాకపోవడంతో మళ్లీ తిరుపతికి వచ్చి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను నడిపారు. ఆ తర్వాత ముక్కు రాజు మాస్టర్ దగ్గర కొంతకాలం పనిచేశారు రాకేష్ మాస్టర్. 'ఆట', 'ఢీ' లాంటి డ్యాన్స్ రియాలిటీ షోల ద్వారా డ్యాన్స్ మాస్టర్‌గా కెరీర్‌ను మొదలు పెట్టారాయన. 'ఢీ' షోలో బషీర్ అనే కుర్రాడికి మాస్టర్‌గా వ్యవహరిస్తున్న సమయంలో ఆ షోకి ఓ జడ్జిగా వ్యవహరించిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, నటుడు ప్రభుదేవాతో 'తెలుగు తెలిసిన వాళ్లే జడ్జిలుగా ఉండాలి' అంటూ కామెంట్స్ చేసి, వార్తల్లో నిలిచారు రాకేష్ మాస్టర్. వేణు తొట్టెంపూడి హీరోగా నటించిన 'చిరునవ్వుతో' లో 'నిన్నలా మొన్నలా లేదురా..' పాటతో సినిమాల్లో కొరియోగ్రాఫర్‌గా తొలి అవకాశం అందుకున్నారాయన. ఆ తర్వాత 'లాహిరి లాహిరి లాహిరిలో, దేవదాసు, సీతారామరాజు, యువరాజు, గర్ల్ ఫ్రెండ్, బడ్జెట్ పద్మనాభం, మనసిచ్చాను, సీతయ్య, అమ్మో పోలీసోళ్లు' వంటి దాదాపు 1500 చిత్రాలకుపైగా కొరియోగ్రఫీ చేశారు రాకేష్ మాస్టర్. 'గ్లోబల్ పీస్ యూనివర్సిటీ' నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారాయన. ప్రభాస్ వంటి పలువురు హీరోలకు డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. టాలీవుడ్‌లోని పలువురు స్టార్ హీరోలందరికీ కొరియోగ్రఫీ చేసిన ఘనత ఆయన సొంతం. ప్రస్తుతం తెలుగులో అగ్ర కొరియోగ్రాఫర్లుగా ఉన్న శేఖర్ మాస్టర్, జానీ మాస్టర్ రాకేష్ మాస్టర్ శిష్యులే కావడం విశేషం. ఓ టీవీ చానల్‌లో ప్రసారం అవుతున్న షోలో పలు స్కిట్లు చేసి, బుల్లితెర ప్రేక్షకుల్ని తనదైన శైలిలో నవ్వించారు రాకేష్ మాస్టర్. కొంతకాలంగా ఆయన సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండేవారు. యూట్యూబ్ చానల్స్ వేదికగా పలువురు సెలబ్రిటీలపై వివాదాస్పద ఇంటర్వ్యూలు ఇచ్చి ఇటీవల మళ్లీ ట్రెండ్ అయ్యారాయన. వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో వారి అభిమానుల నుంచి రాకేష్ మాస్టర్‌కి, ఆయన కుటుంబానికి బెదిరింపులు వచ్చేవి. ఈ కారణంగా ఆయన కుటుంబానికి దూరంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ అనాథ ఆశ్రమంలో ఉంటూ వచ్చారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు చరణ్‌తేజ్, కుమార్తె శ్రీజ ఉన్నారు. రాకేష్ మాస్టర్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు తమ సంతాపం తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని బోరబండలో నేడు రాకేష్ మాస్టర్ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే..

''ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు రాకేష్ మాస్టర్‌ని గాంధీ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. డయాబెటిక్ పేషెంట్ కావడం, సివియర్ మెటబాలిక్ ఎసిడోసిస్ కావడంతో మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ అయి సాయంత్రం 5గంటలకు మృతి చెందారు'' అని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు మీడియాకు తెలిపారు.

సంక్రాంతికి జాతర


ప్రజ్వల్

కన్నడ నటుడు దేవరాజ్ పెద్ద కుమారుడు ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటించనున్న చిత్రం 'జాతర'. ఉదయ్ నందనవనమ్ దర్శకత్వంలో వర్ధమాన్, లోటస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై గోవర్ధన్ రెడ్డి నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఆగస్టులో ప్రారంభంకానుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ–''జాతర'కి మంచి కథ కుదిరింది. ప్రజ్వల్‌కి స్క్రిప్ట్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పేశారు. బి. వాసుదేవ్ రెడ్డి కథకు ఉదయ్ నందనవనమ్ ఇచ్చిన ట్రీట్మెంట్, స్క్రీన్ ప్లే 'జాతర' స్క్రిప్ట్‌ను మరింత కొత్తగా మార్చాయి. హైదరాబాద్, బళ్లారి లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుపుతాం'' అన్నారు. ''ఈ సినిమాలో ప్రేమ కథ ఎంత అందంగా ఉంటుందో, నేపథ్యం కూడా అంతే కొత్తగా ఉంటుంది. ప్రస్తుతం నటీనటుల ఎంపిక జరుగుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా విడుదల చేస్తాం'' అన్నారు ఉదయ్ నందనవనమ్. పాన్ ఇండియా చిత్రంగా రూపొందనున్న ఈ మూవీకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.